క్లుప్తంగా

రేపు శనిత్రయోదశి

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన జైష్ఠ్యాదేవి సమేత శనేశ్వరాలంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిలతైలాభిషేకం, గోత్రనామార్చన పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి, సారంబండ తండాల్లో గురువారం ఎంపీడీఓ జయసుధ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి సమాచారంతో నమోదు చేయాలన్నారు. అనంతరం పంచాయతీలో అభివృద్ధి పనులు నర్సరీలు, పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ పోలింగ్ స్టేషన్ల పరిశీలన..

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో గురువారం ఎంపీడీఓ జయసుధ పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

రాగిజావ పౌడర్ పంపిణీ



పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదన్ సహకారంతో ట్రస్ట్ ఇన్‌చార్జ్ అర్జున్‌గౌడ్ పంచాయతీ సెక్రెటరీ శ్రావణ్‌తో కలిసి గురువారం మండలంలోని కొండూరులో పంచాయతీ సిబ్బందికి రాగిజావ పౌడర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగి పౌడర్ తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఇంద్రకల్, ఐతోల్, పాపగల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ గంగామోహన్ గురువారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యంతోపాటు మూత్రశాలలు, కిటికీలు, తలుపులు ఏర్పాట్లపై బీఎల్‌ఓలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్

వంగూరు: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ అచ్చంపేట నియోజకవర్గ అభ్యర్థి గువ్వల బాల్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని చౌదర్‌పల్లి, పోల్కంపల్లి, కొండారెడ్డిపల్లి, తుమ్మలపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మలాలూయాదవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన నాయకుల స్ఫూర్తితో పోటీ

సాక్షి, నెట్‌వర్క్: బహుజన నాయకుల స్ఫూర్తితో పోటీ చేస్తున్నానని నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్‌లో ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అగ్రకులస్తులను ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కొల్లాపూర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా తాడూరు మండలం శిర్సవాడలో నిర్వహించిన ర్యాలీలో కొత్రబాలు, పృధ్విరాజులు హాజరయ్యారు.

బహుజనులు ఆశీర్వదించాలి

కొల్లాపూర్ రూరల్: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బహుజనులు ఆశీర్వదించాలని భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి తిరుపతమ్మ గౌడ్ అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు బుద్ధి చెప్పాలన్నారు. అంతకు ముందు ఆమె అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కృష్ణయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా

కందనూలు/కోడేరు: పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని, కార్యకర్తలు అధైర్య పడొద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీప్ చారి అన్నారు. బీజేపీ, జనసేన పార్టీల పొత్తుల్లో భాగంగా నాగర్‌కర్నూల్ టికెట్ జనసేన పార్టీకి కేటాయించిన తర్వాత తొలిసారి కార్యకర్తలతో గురువారం జిల్లా కేంద్రంలోని హిమాలయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు అధిష్ఠానం నిర్ణయం మేరకు పని చేయాలని సూచించారు. కోడేరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు నామినేషన్ సందర్భంగా నాయకులు భారీగా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు పుల్లయ్య, బాలపీరు, రామకృష్ణ, రఘు, రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలపై ఆసక్తి

- మామిడి, ఆయిల్‌పాం తోటలలో వేరుశనగ, మినుము సాగు
- లాభాలు గడిస్తున్న రైతులు



పెద్దకొత్తపల్లిలో మామిడి తోటలలో మినుము సాగు



సాతాపూర్‌లో మామిడి తోటలో వేరుశనగ పంట

పెద్దకొత్తపల్లి: వ్యవసాయ సాగులో కాలానుగుణంగా రైతుల ఆలోచనధోరణి మారుతోంది. పాత విధానాలకు స్వస్తి పలుకుతున్నారు. నూతన ఒరవడి శ్రీకారం చుడుతున్నారు. పంటల సాగులలో అంతరపంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో మామిడి, ఆయిల్‌పాం తోటలలో రైతులు అంతర పంటలు సాగు చేసి లాభాలు పొందుతున్నారు. మండలంలో 15 వేల ఎకరాలలో మామిడితోట సాగు అయ్యింది. 1000 ఎకరాలలో ఆయిల్‌పాం సాగు చేపట్టారు. మామిడి తోటలలో అంతరపంటలుగా వేరుశనగ, మినుము సాగును చేపట్టి రైతులు లాభాలు పొందుతున్నారు. అంతరపంటలుగా ఎక్కువగా సాగు చేపట్టిన గ్రామాలు సంజీవాపూర్, ముష్టిపల్లి, చంద్రకల్, వెనచర్ల, ఆదిరాల, నక్కలపల్లి, వావిల్లబావి, పెద్దకొత్తపల్లి, జొన్నలబొగుడ, సాతాపూర్, కల్వకోల్, తిరునాంపల్లి, గంట్రావ్‌పల్లి గ్రామాలు ఉన్నాయి. వేరుశనగ, మినుములు, మొక్కజొన్న, కంది అంతరపంటలుగా సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఈ ఏడాది కేఎల్‌ఐ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీటి మట్టం రాకపోవడంతో మండలంలో తక్కువగా యాసంగి పంటలు వేశారు. యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు వేరుశనగ 3064 ఎకరాలు, మినుము 2534 ఎకరాలు, వేరుశనగ 1819ఎకరాలు, మినుము 1855 ఎకరాలు అదేవిధంగా మొక్కజొన్న 20, కంది 30 ఎకరాలలో సాగు చేశారు.

లాభాలు పొందుతున్నాం..



మామిడితోటలలో అంతరపంటలుగా వేరుశనగ, మినుము పంటలు సాగు చేశా. మామిడి తోటలకు నష్టం వచ్చిన అంతరపంట వలన లాభం పొందుతున్నాం. కేఎల్‌ఐ నీరు రావడం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

కురుమయ్య రైతు పెద్దకొత్తపల్లి

ఐదేళ్ల నుంచి..



ఐదేళ్ల నుంచి ఆయిల్‌పాం తోట సాగు చేస్తున్నా. అంతరపంటలుగా వేరుశనగ, మినుము పంటలు సాగు చేశాం. ఐదు సంవత్సరాల నుంచి కేఎల్‌ఐ ద్వారా సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీంతో సరైన సమయంలో పంటలు చేతికి వచ్చి దిగుబడి పొందుతున్నాం.

భరత్‌గౌడ్, పెద్దకొత్తపల్లి రైతు

రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా



నాగర్‌కర్నూల్‌లో ఇంటింటికి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి, బొందలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనేనన్నారు. 60 ఏండ్లుగా పాలించిన కాంగ్రెస్ ఏం అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ శాసనసభకు ఒక దొరబిడ్డకు, కూలీ బిడ్డకు మధ్య పోరు జరుగుతుందని ప్రజలు గమనించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

నాగర్‌కర్నూల్/తెలకపల్లి: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నాగర్‌కర్నూల్ ఎలా ఉందో ఇప్పుడెలా ఉందో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. తెలకపల్లి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రికి మద్దతుగా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, బాబు, సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

న్యాయసేవలపై అవగాహన ఉండాలి



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న జడ్జి సబిత



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ ఆర్‌వీఎస్‌ఎస్. మిధున్‌తేజ

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో లీగల్ సర్వీసెస్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. కక్షిదారులందరికి సమన్యాయం అందించేందుకు న్యాయవ్యవస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆదాయం రూ.3లక్షలకు తక్కువగా ఉన్న పేదలకు ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చన్నారు. విచారణలో ఉన్న ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే లీగల్ సర్వీసెస్ ద్వారా ప్రభుత్వ న్యాయవాదిని కేటాయిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, న్యాయవాదులు మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావ్, శ్రీరాం ఆర్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కొల్లాపూర్: విద్యార్థులు చట్టాలు, న్యాయసేవలపై కూడా అవగాహన కలిగి ఉండాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ సూచించారు. గురువారం పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. న్యాయస్థానాలు అందించే సేవలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శోభారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వసంతరెడ్డి, నిరంజన్, ఏపీపీలు జుబేదా, శిరీష, న్యాయవాదులు నజీరుద్దీన్, బాలస్వామి, రాఘవేంద్ర, నళిని తదితరులున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ఎంపీ రాములు, ఎమ్మెల్యే బీరం సమక్షంలో పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్ రూరల్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ పి. రాములు అన్నారు. గురువారం మండలంలోని ఎన్మన్‌బెట్లలో ఎంపీ రాములు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 250 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు ఎన్ని ఎత్తుగడలు వేసినా సీఎం కేసీఆర్ తెలంగాణకు చేసిన అభివృద్ధిలో కొట్టుకపోతారన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. అంతకు ముందు ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం తథ్యం

సాక్షి, నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం తథ్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులను కలిసి బీఆర్‌ఎస్‌లో చేరాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు త్వరలో పార్టీలో చేరుతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేద్దామని వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా వెల్దండ మండలం పోతెపల్లిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, మార్కెట్ డైరెక్టర్ రుక్కయ్యయాదవ్ ప్రచారం చేశారు.

ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం

నాగర్‌కర్నూల్/కందనూలు: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తండ్రి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో కలిసి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ సందర్భంగా తాడూరు మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి కార్యకర్తలు జిల్లా కేంద్రానికి ర్యాలీగా తరలివెళ్లారు. తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రాజేష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు హబీబ్, మాజీ మార్కెట్ చైర్మన్ వల్లభ్‌రెడ్డి, జెడ్పీటీసీ రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

సారా విక్రయిస్తే చర్యలు

వెల్దండ: సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గాన్‌గట్టుతండాకు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తండాలో దాడులు నిర్వహించారు. పాత్లవత్ లాలునాయక్ సారా అమ్ముతునట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి ఏడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగులో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మల్లీశ్వరి నుంచి 12 లీటర్ల మద్యం, బీర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్‌కుమార్, బాల్‌రాజులు తెలిపారు.

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లికి చెందిన మద్దెలబండ అశోక్ మద్యం బాటిళ్లను తరలిస్తూ మండల కేంద్రంలో పట్టుబడినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు. అతని వద్ద నుంచి ఎనిమిది ఫుల్‌బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

అమ్రాబాద్: మన్ననూర్ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మొల్కమామిడిలో నిర్వహించిన ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన లభించింది. మొత్తం 126 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జాన్సన్‌సన్,సిబ్బంది గోవిందు, ప్రసన్న, సునీత తదితరులు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా పన్ను వసూళ్లు



చారకొండలో మాట్లాడుతున్న డీపీఓ కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్

చారకొండ: ప్రణాళికాబద్ధంగా పన్నులు వసూళ్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ జయసుధ, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రంలో పంచాయతీ అధికారులు వసతులు పరిశీలించాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నును తప్పనిసరిగా చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల పంచాయతీల ద్వారా వచ్చే పన్నుల వసూళ్లలో కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ గంగామోహన్‌లు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామపంచాయతీలకు సంబంధించిన పన్నులను వంద శాతం వసూలు చేయాలన్నారు. ఉపాధిహామీ పనులు, నర్సరీల నిర్వహణ వివిధ అంశాలపై ఆయా గ్రామాల వారిగా చర్చించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ ప్రవీణ్, ఈసీ కిషన్‌నాయక్, కార్యదర్శులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: జోగులంబ గద్వాల జిల్లాలో ఈనెల 17 నుంచి నిర్వహించే 67వ ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన త్రిశలేశ్వర్, నరేందర్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పాండు, ప్రసాద్ గౌడ్, నురోద్దీన్, రామన్ గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు బారీకేడ్లు అందజేత



తెలకపల్లిలో బారీకేడ్లు అందజేస్తున్న నిర్వాహకులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు నాగార్జున సిమెంట్ సహకారంతో వినాయక ట్రేడర్స్ దుకాణ యజమాని 20 బారీకేడ్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వసిరాంనాయక్ దాతలను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాగార్జున సిమెంట్ ఏఎస్‌ఎం యాదవేంద్ర, సీనియర్ సేల్స్ అధికారి ప్రకాష్‌రెడ్డి, వినాయక్ ట్రేడర్స్ లీడర్ ప్రణవ్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటపై అవగాహన



వేరుశనగను పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: మండలంలోని సూరాపూర్ శివారులో సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం ఏఓ నాగార్జునరెడ్డి పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పూతదశలో ఉన్న వేరుశనగకు ఎకరాకు 200 కిలోల జిప్సమ్ వేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. యాసంగిలో భాగంగా మండల వ్యాప్తంగా 5,400 ఎకరాలలో పంటను సాగు చేశారని పేర్కొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: మండలంలోని చెన్నారం స్టేజీ సమీపంలో ఉన్న లలితా ఉమామహేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లులో గురువారం అధికారులు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారి శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో 0–8 శాతం వరకు తేమ ఉంటే ప్రభుత్వ గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.7020లకు కొనుగోలు చేస్తామన్నారు. తేమ శాతం 12 కన్నా ఎక్కువగా ఉండాలన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డుతోపాటు రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. ఈ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి నర్సింహులు, సూపర్‌వైజర్ శ్రీధర్, మిల్లు యజమానులు సంజీవ్, వెంకట్రామ్, శ్యాం, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను సందర్శించిన డీసీసీబీ సీఈఓ



రైతులకు అందిస్తున్న సేవలను వివరిస్తున్న సీఈఓ రవీందర్‌రావు

ఉప్పునుంతల: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ లక్ష్మయ్య, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని 22 మంది బ్రాంచి మేనేజర్లు గురువారం స్థానిక ప్రాథమిక సహకారం సంఘం (పీఏసీఎస్)ను సందర్శించారు. బ్యాంక్ నుంచి సంఘం సభ్యులకు అందజేస్తున్న రుణాలు, వాటి రికవరీ తదితర వివరాలను పరిశీలించారు. అదేవిధంగా రుణాలతోపాటు పీఏసీఎస్ ద్వార అందుతున్న ఇతర సేవలను వారు అడిగి తెలుసుకున్నారు. ఉప్పునుంతల పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, లింగాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సీఈఓ రవీందర్‌రావు, మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దబాలయ్య, చిన్నబాలయ్యల మధ్య కొంతకాలంగా భూవివాదంపై ఘర్షణలు ఏర్పడ్డాయి. ఇద్దరు పొలం గెట్టు విషయంలో గురువారం ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎల్లికల్, జంగారెడ్డిపల్లి, తిమ్మరాస్‌పల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, రాఘవేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై ప్రచారం

వంగూరు: మండలంలోని కోనేటిపూర్, నర్సంపల్లి, తుమ్మలపల్లి గ్రామాల్లో అచ్చంపేట నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. మండలంలోని గాజర, తుమ్మలపల్లి, వంగూరు గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు వంశీకృష్ణ సమక్షంలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఎన్ రెడ్డి, పండిత్‌రావు, ఎంపీటీసీ రమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. బల్మూర్ మండలంలోని తుమ్మెన్‌పేట బీఆర్‌ఎస్ సర్పంచ్ తిరుపతిరావుతో పాటు వార్డు మెంబర్లు వెంకటమ్మ, సీతారాల లింగమ్మ, కొండారెడ్డిపల్లికి చెందిన తిరుపతయ్య ధర్మారెడ్డితో పాటు 60 మంది కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

మరోసారి ఆశీర్వదించండి

సాక్షి, నెట్‌వర్క్: కొల్లాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జూపల్లి కృష్ణారావు విజయం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా కోడేరు మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు జూపల్లి కృష్ణారావు నామినేషన్ సందర్భంగా ఆంజనేయస్వామి, శివాలయం, మసీద్, చర్చిలో ప్రార్థనలు చేశారు. జూపల్లి కృష్ణారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోడేరు మండల కో ఆప్షన్ సభ్యుడు కరీం, జగదీశ్వర్‌రావు కోరారు.